పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

మధూకర్ (ఫైల్)

చెన్నూర్ రూరల్, మార్చి 1 : డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవలో పది మందిలో దాడికి గురైనందుకు మనస్తాపంతో జోగురి మధూకర్ (21) మనస్తాపానికి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన చెన్నూర్ మండలంలోని కొమ్మెరలో జరిగింది. చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం కొమ్మెర గ్రామానికి చెందిన జోగురి మధూకర్ శుక్రవారం తన స్నేహితుడు పాగె స్వామితో కలిసి నాగాపూర్‌కు వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన గోపి అనే వ్యక్తికి జోగురు మధూకర్‌కు డబ్బుల విషయంలో గొడవ జరిగింది. మధూకర్‌ను గోపి అందరి ముందు బెల్టుతో కొట్టాడు. దీంతో మధూకర్ కొమ్మెర గ్రామానికి వచ్చి మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు పేర్కొన్నారు. తండ్రి శంకరయ్య సాయంత్రం పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చి చూసే సరికి మధూకర్ మృతి చెంది ఉన్నాడని తెలిపాడు. మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఉన్న ఒక్క కొడుకు మృతి చెందడంతో దవాఖానలో కుటుంబ సభ్యులు రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

నలుగురిపై కేసు

వివరాలను వెల్లడిస్తున్న రూరల్‌సీఐ అష్టలుద్దీన్

బెల్లంపల్లి, మార్చి 1 : బొలెరో వాహన డ్రైవర్‌పై దాడికి పాల్పడిన నలుగురిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అష్టలుద్దీన్ తెలిపారు. సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్ఐ రమేశ్‌తో కలిసి వెల్లడించారు. మండలంలోని చర్లపల్లికి చెందిన బొలెరో వాహన డ్రైవర్ దుర్గం మహేందర్‌పై స్థలం విషయంలో వివాదం ఉండడంతో అదే గ్రామానికి చెందిన దుర్గం సన్నీ, దుర్గం సాయి, కోట బానేశ్, కుంటల ఆదిత్య దాడి చేసినట్లు పేర్కొన్నారు. సన్నీ కత్తితో పొడవగా పొట్ట భాగంలో గాయమైందని పేర్కొన్నారు. మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించి, మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మహేందర్ తల్లి యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేశారు. మండల శివారులోని మామిడితోటలో నలుగురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కత్తి, బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

వాహనం ఢీ కొని కానిస్టేబుల్‌కు గాయాలు

నెన్నెల,మార్చి1: నెన్నెల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బాగాల సంతోష్ గుర్తు తెలియని వాహనం ఢీ కొని తీవ్రగాయాల పాలయ్యాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని మోటర్‌సైకిల్‌పై చర్లపల్లి గ్రామానికి తన ఇంటికి వెళ్తుండగా బెల్లంపల్లి నుంచి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో సంతోష్ కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు గమనించి కానిస్టేబుల్‌ను దవాఖానకు తరలించారు. శనివారం అతని భార్య లక్ష్మి నెన్నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో జరిమానా

నోటీసును చూపుస్తున్న తహసీల్దార్

దండేపల్లి, మార్చి1: దండేపల్లి మండలంలోని మేదరిపేటకు చెందిన గోలి రమేశ్‌ను తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టి నాటు సారా తయారీ చేసే వారికి బెల్లం-పటిక విక్రయించవద్దని బైండోవర్ చేశారు. బైండోవర్ చేసిన అనంతరం నాటు సారా తయారు చేసే బెల్లం-పటిక అమ్ముతూ పట్టుబడ్డాడు. బైండోవర్ ఉల్లంఘించినందుకు తహసీల్దార్ సంధ్యారాణి ఉల్లంఘన నోటీసు జారీ చేశారు. నోటీసు ప్రకారం రూ.1లక్ష జరిమానా విధించి కట్టించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సమ్మయ్య, ఎస్ఐ మానిక, సిబ్బంది ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంచిర్యాల అర్బన్, మార్చి 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్‌కు చెందిన ఎల్లం సాయినాథ్ ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయినాథ్ తన ఇంటి ముందు పార్క్ చేసిన టీఎస్ 19 ఎఫ్ 6647 నంబర్ గల వాహనాన్ని వారం రోజుల క్రితం పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు బైకును దొంగలించినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వర్గీకరణ అమలును జాప్యం చేస్తున్న ప్రభుత్వం

మందమర్రి, మార్చి 1: సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్గీకరణ పోరులో ప్రాణాలర్పించిన మాదిగ అమర వీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాల పాటు కొనసాగిన వర్గీకరణ ఉద్యమంలో ఎందరో అమరులయ్యారన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 6న మంచిర్యాలలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కుల సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి జీడి సారంగం, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్, వీహెచ్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, జంపయ్య, మొగిలి, కుమార్, రాజేందర్, మధునయ్య, రాజారాం, రవి తదితరులు పాల్గొన్నారు.

నంబాలలో వైద్యశిబిరం

దండేపల్లి, మార్చి 1: దండేపల్లి మండలంలోని నంబాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం జ్వర నివారణ కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, మండల వైద్యాధికారి సతీశ్, ఎంటీఎస్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ రమణ, కృష్ణవేణి, జీపీ కార్యదర్శి రమేశ్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నిరుపేదలకు కంటి పరీక్షలు

కోటపల్లి, మార్చి 1: రామగుండం పోలీస్ కమిషనరేట్ కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకరాపూర్, శెట్‌పల్లి, బావనపల్లి, పంగిడిసోమారం గ్రామాల్లో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంచిర్యాలకు చెందిన పవన్ ఆప్టికల్స్ సహకారంతో కంటి పరీక్షలను నిర్వహించారు. 43 మందికి కంటి శస్త్ర చికిత్స చేయించాలని సూచించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్ష శిబిరాలను కోటపల్లి ఎస్ఐ రాజేందర్ పరిశీలించారు.

ఎమ్మార్పీఎస్ మాదిగ అమరుల దినోత్సవం

భీమారం, మార్చి 1 : భీమారంలో బస్టాండ్ ప్రాంతంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ మాదిగ అమరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ గాలిపెల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అవిడపు సురేశ్, బీజేపీ నాయకులు గాలిపెల్లి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు కాడారి రాజన్న, రెడ్డి జాగృతి నాయకులు, యాదవ సంఘం నాయకులు తదితరులున్నారు.

పేద యువతి వివాహానికి చేయూత

మందమర్రి, మార్చి 1: నిరుపేద యువతి వివాహానికి అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ దంపతులు ఆర్థిక చేయూతనందించారు. కోటపల్లి మండల పరిధిలోని జనగామ చెందిన కూకట్ల మల్లేశ్వరి పోషం దంపతుల కూతురు అంజలి వివాహం ఈ నెల 9న జరుగనుండగా వారి ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న సదానందం దంపతులు స్థానిక పాతబస్టాండ్ ఏరియాలోని వారి నివాసంలో శనివారం వధువుకు వివాహ ఖర్చుల నిమిత్తం రూ.50 వేల నగదుతో పాటు పెళ్లి వస్త్రాలను అందజేశారు. సదానందం దంపతులను స్థానికులు, యాదవ మహాసభ నాయకులు అభినందించారు.

పంట పొలాల పరిశీలన

మందమర్రి రూరల్, మార్చి 1: మండలంలోని అందుగులపేటలో శనివారం వరి పొలాలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజు రైతులతో కలిసి పరిశీలించారు. వరి పంటలో మోగి పురుగు, ఇతర చీడపురుగుల నుంచి పంటలను కాపాడేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు. వారి వెంట రైతులు హనుమంత రెడ్డి, దుర్గం శ్రీను, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి

మందమర్రి, మార్చి 1: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు రామన్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు నస్సూరి వినయ్ మరణించగా శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. వినయ్ మృతదేహానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, నాయకులు భూపెల్లి కనకయ్య, సీపెల్లి సాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన వినయ్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు. వినయ్ మృతిపై విచారం వ్యక్తం చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనతో విజ్ఞానాభివృద్ధి

ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

చెన్నూర్ టౌన్, మార్చి 1 : వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. చెన్నూర్ పట్టణంలోని అభ్యాస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ కార్నివాల్ కార్యక్రమానికి హాజరై ప్రదర్శనలు తిలకించి అభినందించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పట్టణ ప్రజలు, సైన్స్ ఉపాధ్యాయులు పరిశీలించారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కొరళ్ల శ్యాంసుందర్ రెడ్డి, సురేశ్, రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు కారెంగుల రామయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని వినతి

మందమర్రి, మార్చి 1: మందమర్రి మండల పరిధిలోని 364 సర్వే నంబర్‌లో గల 1.30 ఎకరాల్లో విచారణ జరిపి స్వాధీనం చేసుకోవాలని కోరుతూ బీఎస్పీ నాయకులు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ సబావత్ మోతీలాల్‌కు వినతి పత్రం సమర్పించారు. మందమర్రి శివారులో గల 364 సర్వే నంబరులోని ఎకరం 30 గుంటల భూమి కొద్ది రోజుల క్రితం రికార్డులను తనిఖీ చేయగా ప్రభుత్వ భూమిగా తేలిందని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆ భూమిలో ఓ రియల్ వ్యాపారి ప్లాట్‌లను ఏర్పాటు చేసి విక్రయించాడని , ఓ వ్యక్తి అదే స్థలంలో ఫాంహౌస్‌ను కూడా నిర్మించాడన్నారు. ఆ భూమి పై తగిన విచారణ జరిపి అక్రమ కట్టడాలను తొలగించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు వేముల వీరేందర్, దాగామ శ్రీనివాస్, కుమ్మరి కృష్ణచైతన్య తదితరులున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

చెన్నూర్ టౌన్, మార్చి 1 : చెన్నూర్‌లో ఈనెల 8న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మెజిస్ట్రేట్ పర్వతపు రవి పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ప్రాంగణంలో బుధవారం పలు ప్రభుత్వ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరు పక్షాల సమ్మతితో కేసులు పరిష్కారమవుతాయని తెలిపారు. రాజీపడడమే రాజమార్గమని పట్టణ సీఐ రవీందర్ పేర్కొన్నారు. ఇందులో భూ సమస్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సివిల్, భార్యాభర్తల, ఇతర కేసులు ఉంటాయని తెలిపారు. కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ ఒక అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల ప్రాముఖ్యతపై అవగాహన ఉండాలి

కర్రతో తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, మార్చి 1: ప్రతి ఒక్కరూ పర్యావరణానికి మేలు చేసే పక్షుల ప్రాముఖ్యతపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో అటవీ శాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్), నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ (ఎన్‌సీఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవ్వాల్ బర్డ్స్ ఫెస్టివల్ (పక్షి మహోత్సవం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్షులు ఎంతో జీవవైవిధ్యంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి మేలు చేస్తున్నాయన్నారు. పక్షుల సంరక్షణకు, వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఇలాంటి బర్డ్స్ ఫెస్టివల్ వర్క్ షాప్‌లు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. పక్షుల సంరక్షణ ఒక హాబీగా చేసుకోవాలని, ఇందుకోసం కార్పొరేట్ కంపెనీలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో కాకులు చాలా వరకు అంతరించిపోయాయని, కాకి కనపడితే ఒక ఆశ్చర్యంగా చూసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్ర పక్షి అయిన పాలపిట్టను దసరా పర్వదినాల్లో బంధించి చూడడం నేరమన్నారు. పతంగుల కోసం వాడే మాంజా దారంతో ఎన్నో పక్షులు చనిపోతున్నాయని తెలిపారు. కొన్ని రకాల పక్షులు వేటగాళ్ల బారిన పడి అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో సంచరించే వివిధ రకాల పక్షులతో కూడిన బ్రోచర్ ను విడుదల చేశారు. అనంతరం వర్క్ షాప్‌లో దేశంలో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న పక్షుల వివరాలను, వాటి జీవన విధానం, పర్యావరణంలో వాటి పాత్రపై పక్షుల పై పరిశోధనలపై ప్రముఖులు వివరించారు. ఈ కార్యక్రమంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, సీసీఎఫ్ శరవణన్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల డీఎఫ్‌వోలు శివ్‌ఆశిష్‌సింగ్, నీరజ్ కుమార్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బర్డ్స్ స్టడీస్ (రిషివాలీ) డాక్టర్ శాంతారామ్, వెట్ ల్యాండ్స్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ గుజ్జా భిక్షం, బర్డ్స్ మైగ్రేషన్ స్టడీస్ ప్రముఖులు డాక్టర్ సాతియా సెల్వం బీఎన్‌హెచ్ఎస్, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్ ఎన్‌జీవో సీతారాం రెడ్డి, బర్డ్ బయో జియోగ్రఫీ ప్రముఖులు డాక్టర్ రాబిన్ విజయన్, మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ రావు, వరల్డ్ వైల్డ్ లైఫ్ అధికారులు ఫరీదా తంపాల్, బండి రాజశేఖర్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు, అటవీ శాఖ అధికారులు, అటవీ కళాశాల (ములుగు) విద్యార్థులు, స్థానిక పాఠశాలల టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ సువర్ణ

మానవ మనుగడకు పక్షులు అవసరం

అటవీ ప్రాంతంలో వివిధ రకాల పక్షులను సందర్శించి వాటి యొక్క ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నాం. పక్షులు అడవులను పెంపొందించడంతో పాటు వ్యవసాయంలో రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న పురుగులను, కీటకాలను పక్షులు తిని పంట పొలాలను రక్షిస్తాయి. దాని ద్వారా మనకు మంచి ఆహారం దొరుకుతుంది. వాతావరణంలో వస్తున్న మార్పులతో పక్షులు అంతరించిపోతున్నాయి. పక్షుల సంరక్షణతో మానవ మనుగడ సాధ్యమవుతుంది. పక్షులకు ప్రతి ఒక్కరూ తాగునీరు, ఆహారం అందించాలి.

-కటికల అనీష్, ములుగు ఫారెస్ట్ పీహెచ్‌డీ విద్యార్థి

చాలా ఆనందంగా ఉంది

అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమానికి మమ్మల్నీ ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉంది. ఉదయాన్నే బర్డ్ వాక్ వెళ్లి రకరకాల పక్షులను చూశాం. న్యాచురల్ ఫారెస్ట్‌కు వచ్చి ఇక్కడ ఉన్న మేధావులతో కలిసి కొత్త విషయాలు నేర్చుకోవడం, పక్షులు వివిధ ఏరియాల్లో తీసుకునే ఆహారం, వాటి ఎదుగుదల వంటి విషయాలను తెలుసుకున్నాము. ఈ అవకాశం కల్పించిన అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు.

-అక్కెనపల్లి స్నేహాంజలి, పీహెచ్‌డీ ఫారెస్ట్ ఫైనల్ ఇయర్ (ఎఫ్‌సీఆర్ఐ)

ఆకట్టుకున్న బర్డ్ వాక్ ఫెస్టివల్

ఎంసీసీ క్వారీలో పక్షులను పరిశీలిస్తున్న విద్యార్థులు, అధికారులు

హాజీపూర్, మార్చి 1 : బర్డ్ వాక్ ఫెస్టివల్ సందర్భంగా జిల్లా కేంద్ర సమీపంలోని ఎంసీసీ క్వారీలో లక్షెట్టిపేట రేంజ్ పరిధిలోని తిమ్మాపూర్, పాత మంచిర్యాల బీట్‌లలో ఇటీవల ఏర్పాటు చేసిన జంగల్ సఫారీని సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల విద్యార్థులతో పాటు పరిశోధనా సంస్థ విద్యార్థులు శనివారం తెల్లవారు జామున అటవీ ప్రాంతంలో పర్యటించారు. బర్డ్ వాక్ ఫెస్టివల్‌లో పక్షులపై అధ్యయనం చేశామని తెలిపారు. అడవిలోని పక్షుల కిలకిల రావాలతో ఆహ్లాదాన్ని అందించాయన్నారు. క్వారీ అటవీ ప్రాంతంలో వివిధ రకాలకు చెందిన 40 పక్షులను గుర్తించినట్లు వైల్డ్‌లైఫ్ సంస్థకు చెందిన నిపుణులు రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత మంచిర్యాల సెక్షన్ ఆఫీసర్ హతవుల్లా, బీట్ ఆఫీసర్ రాజేందర్, తిమ్మాపూర్ బీట్ ఆఫీసర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రతినిధులు

రామకృష్ణాపూర్, మార్చి 1: అటవీ శాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా మంచిర్యాల జిల్లాలోని క్యాతన పల్లి పరిధిలోని గాంధారి వనం, బొక్కల గుట్ట సమీపంలోని గాంధారి ఖిల్లాలో బర్డ్స్ ఫెస్టివల్ నిర్వహించారు. మంచిర్యాల కస్తూర్బా పాఠశాల విద్యార్థులు, ములుగులోని అటవీ కళాశాల విద్యార్థులకు పక్షులపై డబ్ల్యూడబ్ల్యూఎఫ్, ఎన్సీఎఫ్ ప్రతినిధులు హర్ష త్రివేణి అమృత, సమాక్షి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారులు అప్పలకొండ శివకుమార్, ప్లాంటేషన్ మేనేజర్ జీ సురేశ్ కుమార్, ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుభాష్, డిప్యూటీ రేంజ్ అధికారులు ఆఫిసొద్దీన్, బీట్ అధికారులు రామకృష్ణ, పోశెట్టి సతీశ్ సిబ్బంది తదితరులున్నారు.

బ్యాంకుల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి

• కుమ్రం భీం ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్

మాట్లాడుతున్న ఏఎస్పీ చిత్తరంజన్,

హాజరైన పోలీస్, బ్యాంకు సిబ్బంది

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 1: ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని బ్యాంకుల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేసుకోవాలని బ్యాంకు అధికారులకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ లోని అన్ని బ్యాంకుల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఇటీవల పలు ప్రాంతాల్లో బ్యాంకుల్లో జరిగిన దొంగతనాలు ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో జరగకుండా బ్యాంకుల లోపల, ముందు, చుట్టు పక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెక్యూరిటీ అలారం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏటీఎంలలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, అక్కడ సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రవీందర్, రమేశ్, సత్యనారాయణ , ఎస్ఐలు చంద్రశేఖర్, సాగర్, శ్రీకాంత్, విజయ్, ప్రశాంత్, బ్యాంకు కంట్రోలర్లు, బ్యాంకు మేనేజర్లు, అధికారులు తదితరులున్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

• సీఎంకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పోస్టుకార్డులు

పోస్టుకార్డులు పంపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

మంచిర్యాలటౌన్, మార్చి 1: విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ శనివారం మంచిర్యాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులను రాసి పంపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత మూడేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు రూ. 8500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చదువు పూర్తిచేసుకున్న వారు పై చదువులకు వెళ్లాలంటే స్కాలర్‌షిప్‌లు రాక కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వక, డబ్బులు కట్టలేక విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. చాలామంది విద్యార్థులు కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని, సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని, స్కాలర్‌షిప్‌లు అందించాలని, విద్యారంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని, హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు కట్టించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. లేదంటే పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని, ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సికిందర్, కార్తీక్, వంశీ, మానస, వైష్ణవి, విద్యార్థులున్నారు.

ఉత్సాహంగా 'ఫేర్‌వెల్' డే

దండేపల్లి : నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి, మార్చి1: దండేపల్లి మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల-కళాశాలలో శనివారం కళాశాల విద్యార్థులకు ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ నెల 5 నుంచి జరగబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాంకిడిలో ప్రభుత్వ జూనియక కళాశాలలో..

వాంకిడి, మార్చి 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సమాచారం విద్యార్థులకు ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన